


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక :19 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 24 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE :19 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 24 SEPTEMBER 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## తప్పు చేసి ఉంటే నేను, నా కుటుంబం నాశనం అయిపోవాలి..

### తిరుమలలో భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణం

- పుష్కరిణిలో స్నానం చేసి అఖిలాండం వద్ద కర్పూర హారతి వెలిగించి ప్రమాణం చేసిన భూమన
- తాను ఒక్క రాజకీయ మాట కూడా మాట్లాడలేదన్న భూమన
- గత కొన్ని రోజులుగా కలత చెందుతున్నానంటూ వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్: వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జంతు కొవ్వు కలిసిన కల్తీ నెయ్యిని వాడారనే వ్యవహారం ఏపీలో రాజకీయ సెగలు పుట్టిస్తోంది. గత పాలకులు కల్తీ నెయ్యి వాడి దోపీడీకి పాల్పడ్డారంటూ కూటమి పార్టీల నేతలు ఆరోపిస్తున్న నేపథ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇవాళ తిరుమలలో శ్రీవారి సాక్షిగా ప్రమాణం చేశారు. "నేను గాని అపరాధం చేసి ఉంటే నాతో పాటు నాకు కుటుంబం కూడా సర్వ నాశనం అయిపోవాలి. నేను ఒక్క రాజకీయ మాట కూడా మాట్లాడలేదు. గోవిందా.. గోవిందా" అని ఆయన ప్రమాణం చేశారు. శరణాగతి తండ్రి.. గత కొన్ని రోజులుగా నా మనసు కలత చెందుతోందని కరుణాకర్ రెడ్డి అన్నారు. కలుషిత రాజకీయ మనష్కులు అత్యంత దారుణంగా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఆలయంలో అత్యంత పవిత్రమైన ప్రసాదాలు, లడ్డూ వ్యవహారం కళంకితమైనదని ఆయన వ్యాఖ్యానించారు. క్షుద్ర రాజకీయాలు మాట్లాడటం నిషిద్ధమని, అపచారమని పేర్కొన్నారు. కాగా ప్రమాణానికి ముందు శ్రీవారి పవిత్ర పుష్కరిణిలో భూమన కరుణాకర్ రెడ్డి స్నానం చేశారు. అఖిలాండం వద్ద కర్పూర హారతి వెలిగించి ప్రమాణం చేశారు. శ్రీవారి ఆలయం మహా ద్వారం వద్ద స్వామివారికి మొక్కారు.

**తిరుపతికి తరలింపు!**

ప్రమాణం అనంతరం భూమన కరుణాకర్ రెడ్డిని పోలీసులు తిరుపతి తరతలించారు. అఖిలాండం వద్ద కరుణాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకొని ఆయన వాహనంలోనే తిరుపతికి పంపించారు.

## జెత్వానీ కేసులో కీలక పరిణామం..

### ముగ్గురు ఐపీఎస్ లను నిందితులుగా చేర్చిన పోలీసులు



- కుక్కల విద్యాసాగర్ ను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన పోలీసులు
- రిమాండ్ రిపోర్టులో ఐపీఎస్ ల పేర్లు
- ఏ2, ఏ3, ఏ6లుగా పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా, విశాల్ గున్నీ

పెన్ పవర్ డెస్క్:ముంబై హీరోయిన్ జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులను పోలీసులు నిందితులుగా చేర్చారు. ఈ కేసులో కీలక నిందితుడు కుక్కల విద్యాసాగర్ ను ఈ తెల్లవారుజామున పోలీసులు మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సీనియర్

వివరాలు 2లో..



## డేంజర్ వైరస్ వచ్చేసింది..

### మంకీపాక్స్ క్లేడ్ 1 స్ట్రెయిన్ తొలి కేసు నమోదు

పెన్ పవర్ డెస్క్: భారత్‌లో మంకీపాక్స్ క్లేడ్ 1 స్ట్రెయిన్ తొలి కేసు నమోదైంది. కేరళకు చెందిన ఒక వ్యక్తికి క్లేడ్ 1 స్ట్రెయిన్ మంకీపాక్స్ వైరస్ సోకినట్లు కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ సోమవారం (సెప్టెంబర్ 23, 2024) నాడు వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించిన ఆందోళనకరమైన క్లేడ్ 1 రకానికి చెందిన కేసు నమోదు కావడంతో ఈ విషయం తెలిసిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన 38 సంవత్సరాల వయసున్న వ్యక్తికి క్లేడ్ 1బీ స్ట్రెయిన్ సోకింది. సదరు వ్యక్తి ఇటీవల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుంచి కేరళకు తిరిగొచ్చినట్లు తెలిసింది.

వివరాలు 2లో..



## పురందేశ్వరికి కీలక బాధ్యతలు అప్పగించిన కేంద్రం

- కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ చైర్ పర్సన్ గా పురందేశ్వరి
- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న రాజమండ్రి ఎంపీ
- లోక్ సభ స్పీకర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ

వివరాలు 2లో..

## జగన్ ఒంటరి....

### జాతీయ పార్టీల నుంచి డోర్లు క్లోజ్



న్యూస్‌డెస్క్ పెన్‌పవర్ న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: ఏపీ ఎన్నికల్లో ఒంటరి పోరు చేసిన వైసీపీ చారిత్రక పరాజయాన్ని మూటగట్టుకుంది. ఓటమి తర్వాత సీనియర్లు పార్టీని వీడుతూ జగన్ ఒంటరి అవుతున్నారు. ఒక వైపు అక్రమాస్తుల కేసులు , మరో వైపు పార్టీ పునర్నిర్మాణం ఆయనకు పెను సవాల్‌గా మారాయి. ఉన్న కష్టాలకు తోడు శ్రీవారి లడ్డు వివాదం వైసీపీ మెడకు చుట్టుకుని ఆ పార్టీ ప్రతిష్టను

వివరాలు 2లో..

## పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

- కేఏ పాల్ పిటిషన్ పై తెలంగాణ హైకోర్టులో విచారణ
- పార్టీ ఫిరాయింపులపై హైకోర్టులో కేఏ పాల్ పిటిషన్
- పార్టీలు మారడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనన్న పాల్
- పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టుకు విన్నపం

వివరాలు 2లో..




## రాముడు వనవాసానికి వెళితే భరతుడిలా బాధ్యతలు చేపట్టా



- ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దే అంటూ మాజీ సీఎం కుర్చీని పక్కనే పెట్టుకున్న అతిశీ
- బాధ్యతలు స్వీకరించాక మీడియాతో మాట్లాడిన అతిశీ
- ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ కు మరోసారి పట్టం కడతారన్న కొత్త సీఎం

వివరాలు 2లో..

## సిట్ తో నిజాలు వెలుగులోకి వచ్చేనా..

స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 23:చేసిన తప్పులు తప్పకుండా వెంటాడుతాయని పెద్దలు తరచూ చెబుతుంటారు. ఈ కొటేషన్ వైసీపీ నేతలకు అతికినట్టు సరిపోతుంది. వైసీపీ ఐదేళ్ల పాలనతో నేతలు ఇష్టా రాజ్యంగా చెలరేగిపోయారు. సింపుల్‌గా చెప్పాలంటే అధికారాన్ని అడ్డం

వివరాలు 2లో..




## పని ఒత్తిడిపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు...

### మండిపడిన కాంగ్రెస్



- విద్యార్థులకు విద్యతో పాటు పని ఒత్తిడి నిర్వహణపై కూడా బోధన జరగాలన్న నిర్మల
- కార్పొరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని కాంగ్రెస్ విమర్శ
- పని విధానం, సుదీర్ఘ పని గంటలు వంటి అంశాల గురించి మాట్లాడాలన్న శివసేన

వివరాలు 2లో..



## ఖాళీ చేసి వెళ్లిపోండి..

### లేకపోతే 80 వేల మంది చనిపోతారు

### లెబనాన్ ప్రజలకు ఇజ్రాయెల్ డెడ్లీ వార్నింగ్

### లెబనాన్‌లో ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు.. 182 మంది మృతి

- హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు
- 700 మందికి పైగా గాయాలు
- లెబనాన్ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు
- మృతుల్లో పిల్లలు, మహిళలు ఉన్నట్లు సమాచారం

వివరాలు 2లో..

## కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే

### కేంద్రమంత్రి బండి సంజయ్



పెన్ పవర్ డెస్క్:ప్రజల దృష్టి మరల్చేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు డ్రామాలాడుతున్నాయని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. అమృత్‌లో

వివరాలు 2లో..

## ఛలో బెంగుళూరు..

### కేడర్ లో బయిటపడుతున్న అసహనం



స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ అనంతపురం, సెప్టెంబర్ 23: వైసీపీ అధినేత వైఎస్ జగన్ తరచూ బెంగళూరుకు వెళుతూ పార్టీ నేతలకు అసహనం రేపుతున్నారు. జగన్ ఎప్పుడు అందుబాటులో ఉండకుండా బెంగళూరులో ఉండటం వల్ల ఇక్కడ క్యాడర్ నుంచి లీడర్ల వరకూ ఎలా ధైర్యంగా ఉంటారన్న ప్రశ్నలు వినపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వైఎస్ జగన్ పది సార్లు బెంగళూరుకు వెళ్లి వచ్చారు. ఎవరైనా చనిపోయినా, లేకపోయినా వరదల వంటి ఆకస్మిక ఘటనలు జరిగితే విజయవాడకు వస్తున్నారు తప్పించి ఇక్కడే ఉండి రాజకీయం చేయడానికి జగన్‌కు మనసొప్పడం లేదంటున్నారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బలపడుతున్న వాణిజ్య బంధాలు

భారత్ ? అమెరికా మధ్య రక్షణ, వాణిజ్య బంధం బలపడుతోంది. అమెరికాలో భారతీయులు ఎక్కువే. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ అభిమానులు చాలా మంది ఉన్నారు. వీరంతా మోదీ ఎప్పుడు అమెరికా వెళ్లినా ఘన స్వాగతం పలకడమే కాదు.. ఓ భారీ ఈవెంట్ కూడా నిర్వహిస్తుంటారు. తాజాగా ప్రధాని మోదీ 3 రోజుల పర్యటనకు అమెరికాకు వెళ్లడంతో.. ప్రవాసులంతా.. వేలాదిగా తరలివచ్చారు. లాంగ్ ఐలాండ్‌లో నస్సావు కొలీజియం స్టేడియం మొత్తం అభిమానులతో నిండిపోయింది. ఈ సందర్భంగా.. సుదీర్ఘ ప్రసంగం చేసిన ప్రధాని మోదీ.. ఇండియా ఎలా వేగంగా అభివృద్ధి చెందుతోందో తెలిపారు.ప్రధాని మోదీ రకరకాల అంశాలపై మాట్లాడారు. భారత్–అమెరికా సంబంధాలపై ముచ్చటించారు. అమెరికాలో భారతీయుల్ని మెచ్చుకున్నారు. వారే ఇండియాకి బ్రాండ్ అంబాసిడర్లు అని అన్నారు. వారి కారణంగానే ఇండియా–అమెరికా సంబంధాలు బలపడుతున్నాయని తెలిపారు. రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య వారధిని నిర్మించడంలో ప్రవాసుల పాత్రను మోదీ మెచ్చుకున్నారు. అందరికీ ఏఐ అంటే.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గుర్తొస్తుందన్న మోదీ.. తనకు మాత్రం ఏఐ అంటే అమెరికా–ఇండియా గుర్తొస్తాయని అన్నారు.ఈ క్రమంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కిల్లర్ డ్రోన్‌లను అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు జో బిడెన్ ఖరారు చేశారు. భారతదేశం అమెరికా నుండి ఎంక్యూ–9బి (16 స్కై గార్డియన్, 15 సీ గార్డియన్) రిమోట్‌గా పైలట్ చేసే విమాన డ్రోన్‌లను కొనుగోలు చేయబోతోంది. ఈ డ్రోన్ల ధర దాదాపు 3 బిలియన్ డాలర్లు.గత ఏడాది జూన్‌లో, రక్షణ మంత్రిత్వ శాఖ అమెరికా నుండి గాలి నుండి ఉపరితల క్షిపణులు, లేజర్–గైడెడ్ బాంబులతో కూడిన ఎంక్యూ–9బి స్కై గార్డియన్, సీ గార్డియన్ సాయుధ డ్రోన్‌లను కొనుగోలు చేయడానికి ఆమోదించింది. భారత్–అమెరికా డిఫెన్స్ ఇండస్ట్రియల్ కోఆపరేషన్ రోడ్‌మ్యాప్‌ను మోదీ, బిడెన్ ప్రశంసించారు. ఈ రోడ్‌మ్యాప్ కింద, భారీ పరికరాలు, జెట్ ఇంజిన్‌లు, మందుగుండు సామగ్రి, గ్రౌండ్ మొబిలిటీ సిస్టమ్‌ల వంటి ఆయుధాల తయారీని చేర్చారు. ఈ ముఖ్యమైన సహకారంలో, లిక్విడ్ రోబోటిక్స్, భారత సముద్ర రక్షణ ఇంజనీరింగ్, సముద్ర భద్రతను పెంపొందించడానికి మానవరహిత ఉపరితల వాహనాల ఉత్పత్తికి కూడా ప్రాధాన్యత ఇవ్వనుంది.క్వాడ్ కాన్ఫరెన్స్ అనంతరం ఇరువురు నేతలూ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరువురు నేతలు భారత్–అమెరికా భాగస్వామ్యాన్ని చాలా పటిష్టంగా అభివర్ణించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇరువురు నేతలు చర్చించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచ, ప్రాంతీయ సమస్యలపై సమావేశంలో చర్చించారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇటీవల మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ద్వైపాక్షిక సమావేశంలో చర్చ జరిగింది., యుఎస్–ఇండియా సిఇఒ ఫోరమ్‌కు కో–ఛైర్‌గా ఉన్న రెండు కంపెనీలు లాక్‌హీడ్ మార్టిన్ మరియు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య సి–130జె సూపర్ హెర్క్యులస్ ఎయిర్‌క్రాఫ్ట్‌పై టీమ్ ఒప్పందాన్ని ఇరువురు నేతలు అభినందించారు. క్వాడ్ ఎవరికీ వ్యతిరేకం కాదనీ, ఇది అంతర్జాతీయ భద్రత, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణ, తూర్పు చైనా సముద్రంలో వివాదాలలో నిమగ్నమై ఉన్న చైనాపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అమెరికాలోని డెలావేర్‌లో జరుగుతున్న క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచాన్ని ఉద్రిక్తతలు, సంఘర్షణలు చుట్టముట్టిన సమయంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు. అలాంటి పరిస్థితిలో భాగస్వామ్య ప్రజాస్వామ్య విలువల ఆధారంగదా క్వాడ్‌తో కలిసి పనిచేయడం మొత్తం మానవాళికి చాలా ముఖ్యమని చెప్పారు. 2021లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షతన జరిగిన తొలి క్వాడ్ సదస్సును ప్రధాని గుర్తుచేసుకున్నారు. చాలా తక్కువ సమయంలో క్వాడ్ దేశాలు సహకారాన్ని ప్రతి దిశలో విస్తరించాయని చెప్పారు. 2025లో ఈ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుండటంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు.అ–130 సూపర్ హెర్క్యులస్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నిర్వహించే భారత నౌకాదళం, గ్లోబల్ పార్టనర్‌ల సంసిద్ధతకు మద్దతుగా భారతదేశంలో కొత్త మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ సదుపాయాన్ని ఈ ఒప్పందం ఏర్పాటు చేస్తుంది. యుఎస్–ఇండియా రక్షణ, ఏరోస్పేస్ సహకారంలో ఇది ఒక ముఖ్యమైన దశ. ఇది ఇరుపక్షాల లోతైన వ్యూహాత్మక, సాంకేతిక భాగస్వామ్య సంబంధాలను ప్రతిబింబిస్తుంది.

# సిట్ తో నిజాలు వెలుగులోకి వచ్చేనా..

- మొదటి పేజి తరువాయి

పెట్టుకుని చేయాల్సిన పనులన్నీ చేశారు. ఇప్పుడు ఇబ్బందులు పాలవుతున్నారు. తాజాగా తిరుమల వ్యవహారంపై చంద్రబాబు సర్కార్ ఏం చేయబోతోందని ఓపెన్‌గా చెప్పేసింది. ఇప్పుడు వైసీపీ పెద్ద తలకాయలకు ఇబ్బందులు తప్పవన్నమాట. తిరుమల వ్యవహారంపై వైసీపీ నేతలు అడ్డంగా ఇరుక్కున్నారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని జగన్ మొదలు మిగతా నేతలంతా బల్లగుద్ది మరీ చెప్పారు. జగన్ అయితే ఓ అడుగు ముందుకేసి ప్రధాని నరేంద్రమోదీ, సీజేఐకి లేఖలు రాశారు.తిరుమల లడ్డూ వ్యవహారంపై అన్నివర్గాల నుంచి వస్తున్న ఒత్తిళ్ల రావడంతో చంద్రబాబు సర్కార్ రంగంలోకి దిగేసింది. సిట్ విచారణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు సీఎం చంద్రబాబు. ఆదివారం రాత్రి మీడియాతో మాట్లాడిన ఆయన, స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు.గడిచిన ఐదేళ్లలో తిరుమలలో జరిగిన అపవిత్రం, లడ్డూ కారణాలు, అధికార దుర్వినియోగం వంటి వ్యవహారాలపై దర్యాప్తు చేయనుంది. ఇందుకోసం ఐజీ స్థాయి అధికారిని నియమించనుంది. సిట్ రిపోర్టు ఆధారంగా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని చెప్పకనే చెప్పేశారు.వైసీపీ సర్కార్ రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమలని వాడుకున్నారని మొదటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పార్టీలే కాదు చివరకు అక్కడికి వచ్చిన భక్తులు సైతం పదేపదే ఆరోపణలు గుప్పించిన సందర్భాలు కోకొల్లలు.దేవుడిపై నమ్మకం లేని వారిని ఛైర్మెన్లగా పెట్టారని, టీటీడీ బోర్డు రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని విమర్శలు జోరందుకున్నాయి. తిరుమల నుంచి ప్రక్షాళన మొదలుపెడతామని సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మొదటి ప్రకటన.వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి హయాంలో తిరుమల నిత్యం వివాదాలమయంగా మారింది. వైవీ సుబ్బారెడ్డి రెండుసార్లు ఛైర్మన్‌గా వ్యవహరించారు. నాలుగేళ్లపాటు ఈయనదే కొనసాగారు. టీటీడీ చరిత్రలో ఇంతకాలం ఛైర్మన్‌గా కొనసాగిన వ్యక్తి మరొకరు లేదు. అడ్డగోలుగా నియామకాలు చేపట్టారు.అన్యమతస్తులను టీటీడీలోకి రప్పించారు. తిరుమల నిర్వీర్యం కావడానికి ఇదీ కూడా ఓ కారణమని భక్తులతోపాటు కూటమి సర్కార్ బలంగా నమ్ముతోంది. సింపుల్‌గా చెప్పాలంటే వైవీ హయాంలో భక్తులకు దేవుడ్ని దూరం చేశారు. టికెట్లను సైతం అమాంతంగా పెంచేశారు.ఇక భూమన కరుణాకర్‌రెడ్డి తక్కువకాలం టీటీడీ ఛైర్మన్‌గా పనిచేశారు. తిరుమలను తన సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నారని అంటున్నారు. టీటీడీ నిధులను మళ్లించడం, ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తాయి.ఇక ధర్మారెడ్డి గురించి చెప్పనక్కర్లేదు. వైఎస్ ఫ్యామిలీకి అత్యంత సన్నిహితుడిగా పేరు గడించారాయన. వైఎస్, జగన్ హయాంలోనూ డిప్యూటేషన్‌పై వచ్చి తిరుమలను పాలించారు. జగన్‌పై కేసులు ఉండడంతో న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖులకు దగ్గరుండి మరీ శ్రీవారి దర్శనాలు చేయించేవారనే అపవాదును మూటగట్టుకున్నారు. శ్రీవాణి ట్రస్టు ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఘన కార్యాలు చేశారని నేతలు ఓపెన్‌గా చెబుతుంటారు. మొత్తానికి తిరుమల వ్యవహారంలో వైసీపీ పెద్ద తలకాయలు ఇరుక్కుంటున్నాయనే చెప్పవచ్చు.

## ఛలో బెంగుళూరు..కేడర్ లో బయిటపడుతున్న అసహనం

- మొదటి పేజి తరువాయి

ఆయన ఎక్కువ సమయం బెంగళూరులోని తన ప్యాలెస్ లోనే గడుపుతుండటం ప్రతిపక్షాల నుంచి మాత్రమే కాదు సొంత పార్టీల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.వైఎస్ జగన్ ఓటమి నుంచి ఇంకా బయటపడలేకపోతున్నారు. తన పార్టీ ఎందుకు దారుణ ఓటమి పాలయిందో తెలుసుకోలేకపోతున్నారు. ఏ పార్టీకైనా క్యాడర్ పటిష్టంగా ఉంటేనే నేతలు ముందుకు వస్తారు. కానీ క్యాడర్ లోనే నైరాశ్యం అలుముకుంటే అది తిరిగి సాధించాలంటే చాలా కష్టతరమైన విషయం. 2014 నుంచి 2019 వరకూ వైసీపీకి పటిష్టమైన క్యాడర్ ఉండేది. ఎలాంటి క్యాడర్ అంటే జగన్ మీద ఈగ వాలితే చాలు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసేంతగా. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ తీరులో పూర్తిగా మార్పు వచ్చింది. అసలు వైసీపీ క్యాడర్ తనకు అవసరం లేదని, తన ఫొటోయే తనను మళ్లీ అందలం ఎక్కిస్తుందని భ్రమలో పడ్డారు. దాని ఫలితాన్ని 2024 ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో చూశారు. పల్నాడు, రాయలసీమ వంటి బలమున్న ప్రాంతాల్లో కూడా పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ క్యాడర్ పత్తా లేరు. దీనికి కారణం జగన్ చేసుకున్న నిర్వాకమే. అది కొందరి నేతలు ఓటమి తర్వాత బాహాటంగా అంగీకరించారు. ఈ విషయాన్ని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి వంటి నేతలు బహిరంగంగానే చెప్పారు. 2029 ఎన్నికల్లో మళ్లీ పార్టీ అధికారంలోకి రావాలంటే బలమైన క్యాడర్ నియోజకవర్గాల్లో అవసరం. 2014 నాటి సీన్ ను జగన్ క్రియేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకు ఏం చేయాలన్న దానిపై ఆలోచన చేయకుండా వైఎస్ జగన్ బెంగళూరులోనే మకాం వేస్తే ప్రయోజనం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు మరోవైపు కీలక నేతలు వైసీపీ నుంచి వెళ్లిపోతున్నారు. దగ్గర వాళ్లు కూడా దూరమవుతున్నారు. ఎవరినీ సముదాయించాల్సిన అవసరం లేదన్న నిర్ణయానికి వైఎస్ జగన్ వచ్చినట్లుంది. వెళ్లే వాళ్లకు గుడ్ బై చెప్పడం మినహా వారిని బతిమాలి.. బుజ్జగించి ఉంచుకోవాల్సిన అవసరం ఏంటన్న అభిప్రాయంలో వైఎస్ జగన్ ఉన్నట్లు కనపడుతుంది. అయితే అదే సమయంలో నియోజకవర్గంలో ముఖ్య నేతలు కూడా పార్టీని వదలిపెట్టి వెళ్లిపోతున్నారు. నేతలంటే వచ్చే ఎన్నికల నాటికి ఎవరికో ఒకరికి టిక్కెట్లు ఇచ్చే అవకాశముంటుంది. కానీ ముఖ్యమైన నేతలు జారిపోతే అలాంటి వారు తయారు చేసుకోవడానికి చాలా శ్రమించాల్సి ఉంటుంది. అంతేకాదు సమయం కూడా తీసుకుంటుంది. రేపు పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాల్సిన క్యాడర్ బలహీనపడిపోతే పార్టీని ఆ దేవుడే రక్షించాలి తప్ప ఎవరూ కాపాడలేరన్న టాక్ బలంగా ఫ్యాన్ పార్టీలో నడుస్తుంది. బెంగళూరులో ఏముందని అక్కడకు వెళ్లి కూర్చోకపోతే..తాడేపల్లిలో క్యాడర్ కు అందుబాటులో ఉండి ప్రతి రోజూ నేతలతో సమావేశమవ్వడం, లేదా జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టడం వల్ల కొంత ధైర్యాన్ని ఇచ్చినట్లవుతుంది. ఇప్పటికే అధికార పార్టీ దూకుడుకు వైసీపీ నేతలు, క్యాడర్ తట్టుకోలేకపోతున్నారు. వైసీపీలో ద్వితీయ శ్రేణి నాయకులు ఆర్థికంగా ఇప్పటికే నష్టపోయి ఉన్నారు. ప్రధాన సామాజికవర్గాలు కూడా దూరమయ్యాయి. బెంగళూరును వదలకపోతే జగన్ కు రానున్న కాలంలో కష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదన్న కామెంట్స్ మాత్రం ఆ పార్టీలో జోరుగా వినిపిస్తున్నాయి. వైసీపీ సోషల్ మీడియా కూడా బలహీనం కావడంతో వాయిస్ లేకుండా పోయింది.

## పురందేశ్వరికి కీలక బాధ్యతలు అప్పగించిన కేంద్రం

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ బీజేపీ చీఫ్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి కేంద్రం కీలక బాధ్యతలు అప్పగించింది. కామన్వెల్త్ మహిళా పార్లమెంటరీ స్టీరింగ్ కమిటీ చైర్ పర్సన్ గా నియమించింది. ఈ మేరకు లోక్ సభ స్పీకర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పురందేశ్వరి ఈ పదవిలో 2026 వరకు కొనసాగనున్నారు. తాజా నియామకం నేపథ్యంలో, పురందేశ్వరికి కేంద్ర మంత్రి పదవి వస్తుందన్న ఊహాగానాలకు తెరపడినట్టయింది. కాగా, పురందేశ్వరి కామన్వెల్త్ పార్లమెంటరీ కమిటీ భారత ప్రాంతీయ ప్రతినిధిగానూ నామినేట్ అయ్యారు.

## రాముడు వనవాసానికి వెళితే భరతుడిలా బాధ్యతలు చేపట్టా

**పెన్ పవర్ డెస్క్:**రామాయణంలో రాజ్యాన్ని వదిలిపెట్టి రాముడు వనవాసానికి వెళితే ఆయన పాదుకలకు పట్టం కట్టి పాలించిన భరతుడిలా ఢిల్లీ ప్రభుత్వ బాధ్యతలు చేపట్టానని సీఎం అతిశీ పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా నేపథ్యంలో శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అతిశీ.. ఈరోజు ముఖ్యమంత్రి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ పై తనకున్న భక్తిని చాటుకున్నారు. గతంలో కేజ్రీవాల్ ఉపయోగించిన కుర్చీని పక్కన పెట్టుకుని తాను మరో కుర్చీలో ఆసీనులయ్యారు. ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దేనని చెప్పారు.నాలుగు నెలల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మరోమారు కేజ్రీవాల్ కు పట్టం కడతారని, ఈ కుర్చీలో మరోమారు ఆయనను కూర్చోబెడతారని తనకు విశ్వాసం ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. రామాయణంలో భరతుడితో తనను తాను పోల్చుకున్నారు. రాముడు వనవాసం వెళితే ఆయన తరఫున ప్రతినిధిగా పాలనా బాధ్యతలను భరతుడు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం తాను కూడా అదేవిధంగా బాధ్యతలు చేపట్టానని వివరించారు. నాలుగు నెలల తర్వాత కేజ్రీవాల్ తిరిగి ఇక్కడికి (సీఎంవోకు) వస్తారని, అప్పటి వరకు పాలన కుంటుపడకుండా తాను చూసుకుంటానని అతిశీ చెప్పుకొచ్చారు.

## జగన్ ఒంటరి....జాతీయ పార్టీల నుంచి డోర్లు క్లోజ్

- మొదటి పేజి తరువాయి

మరింత దిగజారుస్తుంది. ఆ ఎఫెక్ట్‌తో జగన్ జాతీయ స్థాయిలో ఎవరి సపోర్ట్ లేకుండా ఒంటరి అయ్యే పరిస్థితి కనిపిస్తుంది. అదెలా అంటారా? మీరే చూడండి.సింహం సింగిల్‌గా వస్తుంది. ఆ సినిమా డైలాగ్‌ని వైసీపీ అధ్యక్షుడు జగన్ సైన్యం పదేపదే రిపీట్ చేస్తుంటుంది. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే జగన్ నిజంగానే ఒంటరి అయిపోతున్నట్లు కనిపిస్తుంది. రాష్ట్రంలో సీనియర్లు ఒకరొకరుగా గుడ్ బై చెపుతుండటంతో జగన్‌కు సీనియర్ పొలిటీషియన్లు కరువై.. సలహాదారులే మిగులుతారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.అటు జాతీయ స్థాయిలోనూ ఇప్పుడున్న పరిస్థితుల్లో జగన్‌ను సపోర్ట్ చేసే పార్టీ కనిపించడం లేదు.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించిపోతున్నాయని ఆరోపిస్తూ జగన్ ఢిల్లీ వెళ్లి ధర్నా చేశారు. అప్పుడాయనకు ఇండియా కూటమిలోని పెద్ద పార్టీలేవి మద్దతు పలకలేదు. జగన్‌కు కేంద్రంలో ఎన్డీయే కూటమి డోర్లు ఫ్రీజ్ అయిపోయిన పరిస్థితుల్లో.. ఆయన అప్పట్లో ఇండియా కూటమి తనకు మద్దతిస్తుందని భావించారు. అయితే అది జరగలేదు.తాజాగా వైసీపీ శ్రీవారి లడ్డులో కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి ఉక్కిరిబిక్కిరి అవుతుంది. జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఆ మహాపరాధంపై హిందూ సమాజమంతా భగ్గు మంటుంది. దాన్ని డిఫెండ్ చేసుకోవడానికి వైసీపీ నానా పాట్లూ పడుతుంది. అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుతో రహస్యంగా అంటకాగిన జగన్‌కు ఇప్పుడా పరిస్థితి లేదు. అందుకే ఆయన ఓటమి తర్వాత ఇండియా కూటమి వైపు చూశారుఅయితే ఇండియా కూటమిలో జగన్‌కి సొంత చెల్లెలు షర్మిలే పెద్ద స్పీడ్ బ్రేకర్‌గా మారారు. ఏపీలో బలోపేతం అవ్వాలని చూస్తున్న కాంగ్రెస్ ముందు షర్మిలకు ప్రాధాన్యత తగ్గించి వైసీపీని విలీనం చేసుకోవడమూ? లేకపోతే కూటమిలో చేర్చుకోవడమో? చేస్తుందని భావించినా ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. శ్రీవారి లడ్డూ వివాదం జగన్ మెడకు చుట్టుకోవడంతో.. ఇండియా కూటమి ఆయన్ని చేర్చుకోవడం కాదు కదా.. కనీసం ఆ కూటమి పెద్దలు ఆయనకు అపాయింట్‌మెంట్ ఇచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇప్పుడిప్పుడే పుంజుకుంటూ బీజేపీకి సవాలుగా మారుతున్న కాంగ్రెస్ పార్టీ వైసీపీని దగ్గర రానిచ్చే పరిస్థితే లేదు. త్వరలో అయిదు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్నాయి. ఒకవైపు చూస్తే శ్రీవారి లడ్డూ వివాదంతో రాజకీయాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులంతా వైసీపీపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ వైసీపీ షేక్‌హ్యాండ్ ఇస్తే.. ఏం జరుగుతుందో ఆ పార్టీకి తెలియంది కాదువచ్చే 2029 నుంచి మన దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయంటున్నారు. జమిలి ఎన్నికలు జరగడం అంటే దేశవ్యాప్తంగా కీలకమైన ప్రధాన జాతీయ పార్టీల ప్రాబల్యమే ఎన్నికలలో ఎక్కువగా కనిపిస్తుంది. అప్పుడు ప్రాంతీయ పార్టీలు అన్నీ తమ మనుగడకు ఏదో ఒక కూటమిని ఆశ్రయించాల్సి ఉంటుంది.. అయితే జగన్‌కి ఎన్డీఏ డోర్లు క్లోస్ అయిపోయాయి ఇప్పుడు హిందుత్వ సెటిమెంట్‌తో ఇండియా కూటమి గేట్లు ముట్టుకునే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఓవరాల్‌గా వైసీపీ సింగిల్‌గా మిగిలిపోవడం ఖాయమైంది.

## దేంజర్ వైరస్ వచ్చేసింది.. మంకీపాక్స్ క్లేడ్ 1 స్ట్రెయిన్ తొలి కేసు నమోదు

- మొదటి పేజి తరువాయి

సెప్టెంబర్ రెండో వారంలో విదేశాల నుంచి భారత్‌కు తిరిగొచ్చిన ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తి మంకీపాక్స్ బారిన పడినట్లు కేంద్ర వైద్యఆరోగ్య శాఖ నిర్ధారించిన సంగతి తెలిసిందే. ల్యాబ్ పరీక్షల్లో అతనికి మంకీపాక్స్ సోకినట్లు నిర్ధారణ అయిందని కేంద్రం పేర్కొంది. వెస్ట్ ఆఫ్రికన్ క్లేడ్ 2 రకం వైరస్ అతనికి సోకినట్లు కేంద్రం నిర్ధారించింది. భారత్‌లో నమోదైన తొలి మంకీపాక్స్ కేసు ప్రపంచ ఆరోగ్య సంస్థ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడానికి కారణమైన క్లేడ్ 1 మంకీపాక్స్ రకం కాదని కేంద్రం అప్పట్లో స్పష్టం చేసింది. కానీ.. తాజాగా నమోదైన మంకీపాక్స్ కేసు మాత్రం క్లేడ్ 1 స్ట్రెయిన్ కావడం గమనార్హం.మంకీపాక్స్ అనేది తేలికపాటి వైరస్. మశూచి లాంటిదే మంకీపాక్స్ కూడా. ఇది తొలిసారి 1958లో పరిశోధనల్లో భాగంగా కోతుల నుంచి ఈ వ్యాధిని కొనుగొన్నారు. అందుకే దీనికి మంకీపాక్స్ అని పేరు పెట్టారు. 1970లో మొదటిసారి మనుషుల్లో ఈ వ్యాధి కనిపించింది. 2003లో అమెరికాలో ఈ వ్యాధి రోగులను గుర్తించారు. 2018లో ఈ వ్యాధి ఇజ్రాయెల్, బ్రిటన్ లకు చేరుకుంది. మంకీపాక్స్ వ్యాధి సోకితే జ్వరం, తలనొప్పి, వాపు, నడుంనొప్పి, కండరాల నొప్పి, అలసట వంటి లక్షణాలు కన్పిస్తాయి. ముఖం, చేతులు, కాళ్లపై దద్దుర్లు, బొబ్బలు ఏర్పడతాయి. ఒక్కోసారి శరీరమంతా ఇవి వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. ఈ లక్షణాలు 2–4 వారాలపాటు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారిలో చాలామంది వారాల్లోనే కోలుకుంటారు. అయితే 10 మందిలో ఒకరికి ఇది ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది.

## జెత్వానీ కేసులో కీలక పరిణామం.. ముగ్గురు ఐపీఎస్ లను నిందితులుగా చేర్చిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఐపీఎస్ అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, కాంతి రాణా తాతా, విశాల్ గున్నీలను నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ఏ1గా విద్యాసాగర్, ఏ2గా పీఎస్సార్ ఆంజనేయులు, ఏ3గా కాంతి రాణా, ఏ4గా వెస్ట్ జోన్ మాజీ ఏసీపీ హనుమంతరావు, ఏ5గా ఇబ్రహీంపట్నం మాజీ సీఐ సత్యనారాయణ, ఏ6గా విశాల్ గున్నీ పేర్లను పేర్కొన్నారు. మరోవైపు, కుక్కల విద్యాసాగర్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. విద్యాసాగర్ ను విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ కేసులో పలు నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్న నేపథ్యంలో ముగ్గురు ఐపీఎస్ అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కాంతి రాణా తాతా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. రేపటి వరకు కాంతి రాణాపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. ఆయన ముందస్తు బెయిల్ పై హైకోర్టు రేపు తీర్పును వెలువరించనుంది.

## పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

**పెన్ పవర్ డెస్క్:** ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి జంప్ అయిన 10 మంది పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఈ మేరకు 10 మంది ఎమ్మెల్యలను హైకోర్టు ఆదేశించింది. కాగా, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. పార్టీ మారిన ఎమ్మెల్యేల జీతాలు, వారికి సౌకర్యాలు కట్ చేయాలని కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు (సెప్టెంబర్ 23) విచారణ చేపట్టింది. ఈ మేరకు పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి.. కౌంటర్ దాఖలు చేశాలని న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం ఈ పిటిషన్ పై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలు కావడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు కొందరు కాంగ్రెస్ గూటికీ చేరిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్ గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

## ఖాళీ చేసి వెళ్లిపోండి..

**పెన్ పవర్ డెస్క్:**లెబనాన్ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా మిలిటెంట్లే లక్ష్యంగా ఇటీవలే పేజర్స్, వాకీ టాకీలను పేల్చివేసిన ఇజ్రాయెల్.. తాజాగా భీకర వైమానిక దాడులకు పాల్పడింది. లెబనాన్‌లో హిజ్బుల్లాకు చెందిన వందలాది స్థావరాలపై విరుచుకుపడింది. సోమవారం ఉదయం జరిగిన ఈ దాడుల్లో కనీసం 182 మంది మరణించారని, 700 మందికి పైగా గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఏడాది కాలంగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయని, అయితే ఇంత పెద్ద సంఖ్యలో మరణాలు నమోదు కావడం ఇదే తొలిసారి అని పేర్కొంది.

(సోమవారం) ఉదయం నుంచి లెబనాన్ దక్షిణ పట్టణాలు, గ్రామాలపై శత్రు దాడులు జరిగాయి. 182 మంది మరణించారు. 700 మందికి పైగా గాయపడ్డారు. మరణించినవారిలో పిల్లలు, మహిళలు, పారామెడిక్స్ ఉన్నారు" అని పేర్కొంది.కాగా లెబనాన్‌లో దాడులపై ఇజ్రాయెల్ రక్షణమంత్రి యోవ్ గాలంట్ స్పందించారు."లెబనాన్‌లో మా దాడులను తీవ్రతరం చేస్తున్నాం. మా దేశ ఉత్తర భూభాగంలోని ప్రజలు వారి ఇళ్లలో ప్రశాంతంగా నివసించాలనే మా లక్ష్యం నెరవేరే వరకు మా చర్యలు కొనసాగుతాయి" అని స్పష్టం చేశారు. లెబనాన్‌లో వైమానిక దాడుల అనంతరం సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు. ఇరాన్ మద్దతు ఉన్న లెబనాన్‌లో దక్షిణం, తూర్పు బెకా లోయతో పాటు సిరియాకు సమీపంలో ఉండే ఉత్తర ప్రాంతంలో కూడా దాడులు చేశామని పేర్కొన్నారు.

కాగా గతేడాది ఇజ్రాయెల్‌లో నరమేధం సృష్టించిన హమాస్‌కు హిజ్బుల్లా మద్దతిస్తోంది. పలుమార్లు ఇజ్రాయెల్ భూభాగంలోకి రాకెట్‌లను ప్రయోగించింది. అందుకే హిజ్జుల్లా స్థావరాలను దెబ్బతీయడంపై ఇజ్రాయెల్ దృష్టిసారించింది.

## పని ఒత్తిడిపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు... మండిపడిన కాంగ్రెస్

**పెన్ పవర్ డెస్క్:**విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు పని ఒత్తిడి నిర్వహణ మీద బోధన జరగాల్సి ఉందని, సీఏ చదివిన యువతి పని ఒత్తిడిని భరించలేకపోయిందన్న వార్త తనను కలచివేసిందన్నారు. అయితే నిర్మలా సీతారామన్ ఏ కంపెనీ పేరు, యువతి పేరును ప్రస్తావించలేదు. కానీ ఇటీవల యర్నెస్ట్ యంగ్ ఇండియా ఉద్యోగి మరణాన్ని ఉద్దేశిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు పని ఒత్తిడిని జయించడాన్ని కూడా విద్యా సంస్థలు బోధించాలన్నారు.

ఆమె వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షీణిస్తున్న పని పరిస్థితుల గురించి మాట్లాడకుండా... పని ఒత్తిడిని జయించడం గురించి మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పేర్కొంది. కార్పొరేట్లకు ఇబ్బంది వచ్చినప్పుడే ఆర్థికమంత్రి పట్టించుకుంటారని, కార్పొరేట్ శ్రమ దోపిడీకి గురైన అన్నాసెబాస్టియన్ వంటి వారి బాధలు పట్టవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి అండగా నిలవాల్సింది పోయి... ఆమెదే తప్పన్నట్లుగా మాట్లాడటం సరికాదన్నారు.

క్లిష్టమైన కోర్సుల్లో ఒకటైన చార్టర్డ్ అకౌంటెన్సీ చేసిన యువతికి పని ఒత్తిడి గురించి చెప్పాల్సిన అవసరం లేదని శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది మండిపడ్డారు. పని విధానం, సుదీర్ఘ పని గంటలు వంటి అంశాల గురించి ఆర్థికమంత్రి మాట్లాడాలని హితవు పలికారు. సున్నిత అంశాల పట్ల ఆచితూచి మాట్లాడాలన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే

- మొదటి పేజి తరువాయి

జరిగిన అవినీతి బయటకు రావాలంటే సీవీసీ విచారణను కోరాలని డిమాండ్ చేశారు. దేశంలోని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చే ఒక సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని ప్రవేశపెడితే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతూ ఈ పథకం ప్రయోజనాలు ప్రజలకు అందకుండా చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడి తమకు కావాల్సిన వాళ్లకే కాంట్రాక్టులు కట్టబెట్టిందని బీఆర్ఎస్ ఆరోపిస్తుంటే, గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేయడం దొందుదొందే అన్న విధంగా ఉందన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీల అమలులో వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించేందుకు వీరిరువురూ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకుంటూ డ్రామా చేస్తున్నారని దుయ్యబట్టారు. అమృత్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని, కాంట్రాక్టు కట్టబెట్టడంలో పక్షపాతం చూపలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే తక్షణమే సీవీసీకి లేఖ రాయాలన్నారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడినట్టు భావించాల్సి వస్తుందని అన్నారు. సీవీసీ లేఖ రాస్తే దీనిపై విచారణ జరిపేందుకు సీవీసీని ఒప్పించేలా నేనే వ్యక్తిగతంగా చొరవ చూపుతానని తెలిపారు.

# వల "సలసల" జనసేనలోకి వలసలు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 23:** వైసీపీ టూ జనసేన వలసల సీజన్ మొదలైంది. ప్రస్తుతానికి బాలినేని, సామినేని కనిపిస్తున్నా.. మరికొందరు జంపింగ్ చేసేందుకు రెడీ అవుతున్నారని ప్రచారం జరుగుతోంది.. ఎన్నికల ప్రచార సమయంలోనే జగన్‌కి జనసేనాని వార్నింగ్ ఇచ్చారు. గుర్తు పెట్టుకో.. నెత్తిన కాలేసి తొక్కకపోతే, నా పేరు పవన్ కాదని పవర్‌ఫుల్ పంచ్ విసిరారు.. ఇప్పుడు ఓటమి భారం నుంచి జగన్ పూర్తిగా తేరుకోకముందే.. పవన్ అన్నంత పనీ చేస్తున్నారు. అసలు చేరికలపై సేనాని వ్యూహమేంటి? కూటమి పార్టీల ఏకాభిప్రాయంతోనే ఈ జంపింగ్స్ జరుగుతున్నాయా? వైసీపీ అధ్యక్షుడు జగన్ తీరుపై ఆ పార్టీ సీనియర్ నాయకులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీని వీడుతున్నారు. ఓటమి తర్వాత కూడా జగన్ వైఖరిలో ఎలాంటి మార్పూ లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జనసేనలో చేరేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కలువనున్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి కృష్ణా జిల్లా వైసిపి సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో విడివిడిగా కలిసి ఆయనతో చర్చించారు. పార్టీలో చేరతామని ప్రతిపాదించారు. అందుకు పవన్‌కల్యాణ్ అంగీకరించారు. సెప్టెంబర్ 22న జనసేనలో చేరుతున్నట్లు సామినేని ఉదయభాను ప్రకటించారు.ఒంగోలులో పవన్‌కల్యాణ్ సమక్షంలో తాను, తన అనుచరులంతా జనసేనలో చేరుతున్నామని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు ? వైఎస్ తనకు రాజకీయ భిక్ష పెట్టారని.. ఆ కుటుంబం పట్ల గౌరవంతోనే జగన్ కోసం రాజీనామా చేశామని పేర్కొన్నారు. రాజశేఖరరెడ్డిపై గౌరవంతోనే జగన్‌ను ఇంత కాలం భరించానని.. ఎన్నికల్లో పార్టీ ఓడిపోయినా ఇప్పటికీ జగన్ మారలేదని విమర్శించారు.ఎన్నికల ప్రచారంలోనే పవన్‌కల్యాణ్ పవర్ ఫుల్ ఛాలెంజ్ చేశారు. జగన్‌ను అధ:పాతాళానికి తొక్కకపోతే తన పేరు పవనే కాదని బహిరంగ సభా వేదికపై నుంచి సవాల్

విసిరారు. దానికి తగ్గట్లే అసెంబ్లీలో వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేయడంలో కీ రోల్ పోషించారు. జనసేన వైసీపీ కంటే పెద్ద పార్టీగా అవతరించింది. ఇక ఇప్పుడు ప్రచారంలో సవాల్ చేసినట్లు జగన్ పార్టీని నామరూపాలు లేకుండా చేసే పనిలో పడినట్లు కనిపిస్తున్నారు.జనసేనలో చేరికకు రెడీ అయిన సామినేని, బాలినేని ఆషామాషీ నేతలు కాదు. ఇద్దరూ వైఎస్‌ఆర్ సీఎం కాక ముందు నుంచి ఆయనకు సన్నిహితులే. వైఎస్ పీసీసీ అధ్యక్షుడిగా పాదయాత్ర చేసినప్పుడు ఆయనతో కలిసి నడిచారు.. వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్ వెంటే ఉన్నారు .. పైగా బాలినేనికి జగన్‌తో బంధుత్వం కూడా ఉంది. అలాంటి వారు వైసీపీకి గుడ్‌బై చెప్పడం ఆ పార్టీ కేడర్‌ను డైలమాలో పడేస్తోందంట.బాలినేని, సామినేనిల బాటలో మరో 25 మంది మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు జనసేనలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వైసీపీ నుంచి వచ్చే ప్రతి ఒక్కరి వివరాలు మూడు మిత్రపక్షాల ప్రతినిధులు కలిసి చర్చించుకున్న తర్వాతే నిర్ణయం తీసుకుంటున్నారంట. వైసీపీ నుంచి వస్తున్న వారిని చేర్చుకోవాలా? వద్దా అని నిర్ణయించడానికి ముగ్గురితో కమిటీ కూడా వేశారంట.కూటమి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న బిజెపి నేత సత్యకుమార్ యాదవ్, జనసేన సీనియర్ నాదేండ్ల మనోహన్, టీడీపీ నుంచి నారా లోకేష్ ఆ స్క్రూటినీ కమిటీలో మెంబర్లుగా ఉన్నారంట. ఆయా పార్టీల్లో ఆ ముగ్గురు కీలక నేతలే అవ్వడంతో.. వారు ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకున్న తర్వాతనే ఏ పార్టీలో చేర్చుకోవడానికైనా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారంట.. మొత్తానికి పవన్ ఛాలెంజ్‌కి తగ్గట్లే కూటమి పార్టీలు వైసీపీని ఖాళీ చేసే దిశగా పావులు కదుపుతున్నట్లు కనిపిస్తున్నాయి.

## ఏపీలో కొనసాగుతున్నఆపరేషన్ ఫీ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ విజయవాడ, సెప్టెంబర్ 23:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యిలో కల్తీ జరిగిందనే ఆరోపణలు, నివేదికలు?ఏపీలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో కూడా కలకలం రేపుతున్నాయి. ఈ ఎఫెక్ట్? విజయవాడ కనకదుర్గ ఆలయం, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అన్నవరం సత్యనారాయణ స్వామి, సింహాచలం అప్పన్న దేవాలయాలపై గట్టిగానే పడింది. ఆయా ఆలయాల్లో ప్రసాదాలను ఆవు నెయ్యితోనే తయారు చేస్తున్నారా? నాణ్యతా ప్రమాణాలు ఎంతవరకు పాటిస్తున్నారు అనేదానిపై ఏపీ సర్కార్ ఫోకస్ పెట్టింది.అన్ని అలయాల్లోనూ నెయ్యి క్వాలిటీపై ప్రభుత్వం దృష్టి సారించింది. సింహాచలం, అన్నవరంలో ప్రసాదాల నుంచి శాంపిల్స్ సేకరించారు.అన్నవరం దేవస్థానంలో వాడే నెయ్యి గడ చిన రెండేళ్లుగా ఒకే కాంట్రాక్టర్ సరఫరా చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. అలాగే అంతర్వేది, వాడపల్లి.. పాదగయ తదితర ఆలయాల్లో ఇచ్చే ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై ఇప్పుడు అందరి దృష్టిపడింది. దేవుడి దీపారా ధనకు వినియోగించే నెయ్యి, ప్రసాదాల్లో వాడే నెయ్యి అసలు ఎక్కడి నుంచి వస్తోంది? ఎంత ధరకు కొంటున్నారు? నాణ్యత అసలు పాటిస్తున్నారా? అనే చర్చ రెండ్రోజులుగా జరుగుతోంది. మరోపక్క తిరుపతి ఘటనతో ఉమ్మడి జిల్లాలో ఆలయాల్లో అధికారులు సైతం ఉలిక్కి పడుతున్నారు. ఇంతకాలం వాడుతున్న నెయ్యి నాణ్యతపై పెద్దగా దృష్టిసారించని అధికారులు తాజా పరి ణామాలతో నెయ్యి సరఫరా కాంట్రాక్టర్లను పిలిచి మాట్లాడుతున్నారు. నెయ్యి ఎక్కడి నుంచి తెస్తున్నారు? నాణ్యత మంచిదేనా అంటూ ఆరా తీస్తున్నారు. కాగా అన్నవరం దేవస్థానానికి ప్రస్తుతం నెయ్యి సరఫరా చేస్తోన్న కాంట్రాక్టరు గడువు ఈనెలతో ముగుస్తోంది. వచ్చేనెల ఒకటి నుంచి మరో కొత్త కాంట్రాక్టరు వస్తున్నారు. దీంతో ఆ నెయ్యిపైనా ఇప్పటినుంచే అధికారులు దృష్టిసారించారు. కొత్త కాంట్రాక్టు కంపెనీ తిరుపతిది కావడంతో అక్కడ ఎక్కడ కొనుగోలు చేస్తు న్నారో కొందరు ఆరా తీస్తున్నారు. మరోపక్క తిరుపతి ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతుండడం, ఇదే సమయంలో ఇతర ఆలయాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపైనా కొత్తగా సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని ఆలయాల నుంచి నెయ్యి శాంపిళ్లను త్వరలో పరీక్షించాలని నిర్ణయించింది. అన్నవరంతోపాటు ఇతర ఆలయాల నెయ్యి శాంపిళ్లను అధికారులు సేకరించబోతున్నారు. కాగా ఆలయాల్లో ప్రసాదాలు, దీపారాధనకు వినియోగించే నెయ్యి ఎలాంటిది? ఎక్కడి నుంచి వస్తుంది? ఎంతకు ఆలయ అధికారులు కొనుగోలు చేస్తారు? వంటి వివరాలు ఇంతకాలం అసలు ఎవరు పట్టించుకోలేదు. కానీ తిరుపతి ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రతి చోటా నెయ్యి నాణ్యతపైనే అంతా చర్చించుకుంటున్నారు. ఇదిలాఉంటే కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు అనేక పట్టణాల్లో స్థానిక డెయిరీలు, ఇతర ప్రైవేటు వ్యాపారులు నెయ్యిని ప్యాకెట్లతోపాటు లూజుగాను విక్రయిస్తుంటారు. తాజా ఘటన నేపథ్యంలో ప్రజలు నెయ్యి నాణ్యతను ఆరా తీస్తూ జాగ్రత్త పడుతుండడం విశేషం. అటు సోషల్ మీడియాలోను ఇదే విషయం హాట్‌టాపిక్‌గా మారింది. ఇలా ఏపీ వ్యాప్తంగా ఆపరేషన్ ఫీకి శ్రీకారం చుట్టింది చంద్రబాబు సర్కార్. దీనిలో భాగంగాలో సింహాచలంలో తనిఖీలు నిర్వహించారు ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు. ప్రసాదం నాణ్యతను పరిశీలించి రికార్డులను చెక్ చేశారు గంటా. లడ్డూ బరువును తూకం వేసి పరిశీలించారు. తక్కువ రేట్లకు నెయ్యి కొంటే..దానిలో క్వాలిటీ ఎలా ఉంటుందని అధికారులను ప్రశ్నించారు.ఇక అన్నవరం ప్రసాదంపై కూడా ఆరోపణలు రావడంతో?ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ పరిశీలించారు. ప్రసాదం నాసిరకంగా ఉందని ఆరోపణలు రావడంతోనే తనిఖీలు నిర్వహించామన్నారు ఎమ్మెల్యే. 6 నెలలకు ఒకసారి టెండర్‌ను మార్చాల్సి ఉందని, అయితే రెండేళ్లుగా ఒకే వ్యక్తికి టెండర్ ఇచ్చారన్నారు సత్యప్రభ. ప్రసాదంలో వాడే పదార్థాల శాంపిల్స్‌ను సేకరించామని, దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామని చెప్పారు.ఇలా రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రసాదాల పరీక్ష, టెండర్ల తనిఖీ, వస్తువుల క్వాలిటీ చెకింగ్ చేపడుతున్నారు

## లడ్డూ సరే... మిగిలిన వాటి సంగతేంటీ



**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ తిరుమల, సెప్టెంబర్ 23:** తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లడ్డూల్లో వినియోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు, కూరగాయలు నూనె కలిసిందని ప్రకటించారు. ఆయన చెప్పిన నిమిషాల వ్యవధిలో రాష్ట్ర కాదు దేశం కాదు ప్రపంచ వ్యాప్తంగా ఆ వార్త దావానలంలా మార్చేసింది. ఆ నెయ్యికి సంబంధించిన వివరాలు సైతం టీటీడీ ఈవో శ్యామల రావు స్పష్టం చేశారు. తమిళనాడు రాష్ట్రం దిన్డుగల్ కి చెందిన ఏ ఆర్ డైరీ ఫూడ్ ప్రైవేట్ లిమిటెడ్ నెయ్యి 10 ట్యాంకులు వచ్చింది.. అందులో 6 ట్యాంకులు నెయ్యి బాగుంది. నాణ్యత లేని మరో 4 నెయ్యి ట్యాంకులను పరీక్షలు కోసం నమూనాలు తొలి సారి టీటీడీ నుంచి బయట ల్యాబ్ కు పంపి పరీక్షలు చేయించారు.అయితే, ఆ పరీక్షల్లో నెయ్యి కల్తీ గా మారిందని.. సాధారణంగా ఉండాల్సిన విలువల కన్నా వేరుగా నివేదికల ద్వారా తేలింది. అందులోను వివిధ కూరగాయల నూనెలు, చేప నూనె, జంతువుల కొవ్వు ఉందని నిర్ధారణ అయిందని టీటీడీ ప్రకటించింది. అయితే ఈవో ఫిర్యాదు మేరకు తమిళనాడులోని డైరీ పై కూడా అక్కడి అధికారులు తనిఖీలు జరిగాయి. దీంతో ఆ సంస్థ ప్రతినిధులు సైతం మాట్లాడారు. తమకు సంబంధం లేదని.. తాము మంచి నెయ్యి పంపామని.. ఎక్కడైనా పరీక్షలు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరిగినా దానికి కారణం టీటీడీ వద్ద ల్యాబ్ లేదని కాంట్రాక్టర్లు ఇలా నాసిరకం పంపారని ఈవో అంటున్నారు. టీటీడీది తప్పు లేదు.. డైరీ వాళ్లది తప్పు లేదు మరీ ఎవరిది తప్పు.. ఎవరిది బాధ్యత..? అసలు కల్తీ జరిగిందా లేదా అనేది పెరుమాళ్లకెరుక అని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.టీటీడీ టెండర్ విధానం ద్వారా వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేస్తుంది. వీటి అన్నింటిని టీటీడీ మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో గోడౌన్ లో ఉంచి వాటిని టీటీడీ సంస్థలకు పంపిణీ చేస్తారు. తిరుమల, టీటీడీ అనుబంధ సంస్థలు అన్నింటికి ఇస్తారు. వీటికి నిబంధనలు, సూచనలు, క్వాలిటీ పరీక్షలు చేస్తామని టీటీడీ గతంలో చెప్పారు. వాటితోనే స్వామి వారి తో పాటు ఆలయాలకు, భక్తులకు, ఉద్యోగులకు, టీటీడీ ఆసుపత్రులు, విద్యార్థులకు అందిస్తారు. అలాంటి వాటి పై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇక దాతలు, భక్తులు ఇచ్చే విరాళం ముడి సరుకుల పరిస్థితి ఏమిటి.. దాతలు ఇచ్చే వాటికి ఎలాంటి పరీక్షలు ఉంటాయి.. నిజంగా దాతలు టీటీడీకి సరిపడే నాణ్యతతో ఇస్తున్నారా.. ఒక వేళ ఇవ్వకపోతే వాటిని ఎక్కడ.. ఎలా తనిఖీ చేస్తున్నారు. నాణ్యత సరిగ్గా లేకపోతే వాటిని ఏమి చేస్తున్నారు అనేవి ప్రస్తుతం భక్తుల నుంచి ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్నలు. దీనిపై టీటీడీ కూడా సమాధానం ఇవ్వాలి.

**బయిటకొస్తున్న వ్యవహారాలు :**

తిరుమలలో లడ్డూ వ్యవహారం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో స్వచ్ఛమైన నెయ్యికి బదులుగా కల్తీ నెయ్యి కలిసిందని రిపోర్టులు బయటికి వచ్చాయి. ఆ కల్తీ నెయ్యిలో చేప నూనె, జంతువుల కొవ్వు నుంచి తీసిన నూనెలు కలిశాయన్న విషయం సంచలనంగా మారింది. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వమే కమిషన్ల కోసం నెయ్యి సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌ను మార్చారనేది ఆరోపణ. ఈ విషయంలో టీడీపీ గత ప్రభుత్వంపై చాలా ఆరోపణలు చేస్తోంది. తిరుమల లడ్డూ వ్యవహారంలోనే కాక, గత ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న వారు తిరుమలలో తమకు నచ్చినట్లుగా దోచుకున్నారని కూడా టీడీపీ ఆరోపిస్తోంది. తాజాగా మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజాపై టీడీపీ ఆరోపణలు చేసింది.వీరిద్దరూ శ్రీవారి దర్శనం టికెట్లను అమ్ముకున్నారని తెలుగు దేశం సోషల్ మీడియా వేదికగా సంచలన ఆరోపణలు చేసింది. కళాధర్ ట్రావెల్స్ పేరుతో పెద్దిరెడ్డి, బుక్ మై దర్శన్ పేరుతో ఆర్కే రోజా పరోక్షంగా టీటీడీ దర్శనాల విషయంలో అందినకాడికి దండుకున్నారని ఆరోపణలు చేస్తున్నారు.కళాధర్ ట్రావెల్స్ స్కామ్: పెద్దిరెడ్డి బినామీ కళాధర్ ట్రావెల్స్. ప్రతిరోజూ టూరిజం డిపార్ట్‌మెంట్ కు 1000 దర్శనం టికెట్లు కేటాయిస్తే, అందులో 800 టికెట్లు కళాధర్ ట్రావెల్స్‌కే వెళ్లేవి. నడవాల్సింది 30 బస్సులు కాగా, నడిచినవి కేవలం 4 బస్సులే. ఈ స్కామ్‌లో ఒక్కో టికెట్‌ను రూ.5,550 కి అమ్ముకున్నారబుక్ మై దర్శన్ స్కామ్: బుక్ మై దర్శన్ కింద 75 టికెట్లను కేటాయించేవారు. ఒక్కో టికెట్ అమ్మాల్సింది రూ.1250 అయితే, అమ్ముకొన్నది మాత్రం రూ.5 వేల నుంచి రూ.10 వేల మధ్య. ఈ టికెట్ల అమ్మకం కోసం రోజా టీం 20 మంది పని చేసేవారు. అయితే, ఈ దోపిడీలో తాడేపల్లి వాటా ఎంత?" అని టీడీపీ సోషల్ మీడియాలో ఆ ఇద్దరు మంత్రులను టార్గెట్ చేస్తూ సంచలనంగా ఆరోపణలు చేసింది."వైసీపీ హయాంలో జగన్ అండ దండలతో తిరుమల కొండపై శ్రీవారి దర్శనాలను వ్యాపారం చేశారు అప్పటి మంత్రులు పెద్దిరెడ్డి, రోజా. దర్శనం టికెట్లు బ్లాక్ లో అమ్మించి రోజుకి కోటి వరకూ దండుకున్నారు" అని సోషల్ మీడియాలో టీడీపీ పోస్టు చేసింది.

## లడ్డూ వ్యవహారంతో జగన్ ఇమేజ్ డ్యామేజ్ ...




**స్టాఫ్ రిపోర్టర్ పెన్‌పవర్ గుంటూరు, సెప్టెంబర్ 23:** తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో వైఎస్ఆర్‌సీపీ వ్యూహాత్మక తప్పిదం చేసినట్లుగా రాజకీయం మారుతోంది. టీటీడీ బోర్డు స్వతంత్రంగా ఉంటుంది. రోజువారీ వ్యవహారాలు బోర్డే చూసుకుంటుంది... అని స్వయంగా సీఎం జగన్ ప్రెస్ మీట్‌లో చెప్పినా.. నెయ్యి కల్తీ వ్యవహారమంతా గత ప్రభుత్వం తప్పే అన్నట్లుగా ఇతర పార్టీలన్నీ ప్రొజెక్ట్ చేశాయి. వైసీపీ దాన్ని తిప్పికొట్టలేకపోయింది. తప్పు చేయలేదని బలంగా వాదించలేకపోయారు. తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాత్రం అంటున్నారు. ఈ వ్యవహారంతో తెలుగు రాష్ట్రాల్లో రోడ్లెక్కి ఎవరూ ధర్నాలు చేయడం లేదు కానీ..ఉత్తరాదిలో మాత్రం జగన్‌కు వ్యతిరేకంగా ధర్నాలు జరుగుతున్నాయి. హిందూత్వ రాజకీయాలు దక్షిణాదిలో కన్నా ఉత్తరాదిన ఎక్కువగా ఉంటాయి. తిరుమల అనేది ఉత్తరాది హిందూ భక్తులకు కూడా అత్యంత పవిత్రమైన ప్రదేశం. అలాంటి హిందూ ఆలయంలో.. అపచారం జరిగిందని తెలిసిన తర్వాత భారతీయ జనతా పార్టీ నేతలు ఘాటుగా స్పందించారు. దీంతో సహజంగానే హిందూత్వ వాదులు రంగంలోకి దిగిపోయారు. యూపీ, మధ్యప్రదేశ్ వంటి చోట్ల నిరసనలు జరిగాయి. ఈ వ్యవహారంలో దేశవ్యాప్తంగా జగన్ ఇ?మజ్ హిందూవ్యతిరేకిగా మారిపోయింది. అదే సమయంలో జగన్ క్రిస్టియానిటీ, ఆయన కుటుంబ నేపథ్యం, ఏపీలో గత ఐదేళ్లలో జరిగిన మత మార్పిళ్లు ఇలా ప్రతీ అంశాన్ని సోషల్ మీడియాలో హైలెట్ చేశారు. దీంతో జగన్ హిందూ వ్యతిరేకగా ఉత్తరాదిన మారిపోయారు. వైసీపీ ఇప్పుడు ఏపీ దాటి ఎక్కడా పోటీ చేయడం లేదు. కనీసం తెలంగాణలో కూడా పోటీ చేయడం లేదు. మరి నార్త్ లో జగన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి పరిణామాలు జరిగితే ఆయనకు ఏంటి..బిందాస్ అనుకోవడానికి లేదు. ఎందుకంటే.. ఎన్నికల్లో పోటీ చేసి.. ఫలితాలు సాధించాల్సినది ఏపీలోనే అయినా దేశవ్యాప్తంగా జగన్ ఇమేజ్ కూడా ముఖ్యమే. ఎందుకంటే.. రాబోయే రోజుల్లో జగన్మోహన్ రెడ్డి ఏదో ఓ కూటమిలో భాగంగా మారిపోవాల్సి ఉంటుంది. ఇటీవల ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు ఆయన ఇండియా కూటమి పార్టీల మద్దతు కూడగట్టగలిగారు దానికి కారణం ఆయనకు జాతీయ స్థాయిలో ఎలాంటి ఇమేజ్ లేకపోవడమే . కానీ ఇప్పుడు ఆయనపై హిందూ వ్యతిరేక ముద్ర పడింది. ఇప్పుడు ఆయన ఢిల్లీ లో ఏదైనా మద్దతు కోసం రాజకీయ పార్టీల వద్దకు వెళ్తే ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి వస్తుంది. తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారం పూర్తిగా వైఎస్ఆర్‌సీపీ మీద పడిపోయింది. నాటి టీటీడీ బోర్డుపై ఎక్కువ బాధ్యత పెట్టేసి ఉంటే.. పూర్తిగా జరిగిన తప్పిదం అంతా వైసీపీ మీద పడి ఉండేది కాదు. కానీ తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు.. జగన్ పాలనలోనే జరిగిందని ఆరోపించారు. దానికి తగ్గట్లగానే రాజకీయం నడిచింది. వైసీపీ కేంద్రంగానే వివాదం రాజుకుంది. ఆ ట్రాప్ లో వైసీపీ పడిపోయింది. చివరికి రాహుల్ గాంధీ కూడా లడ్డూ వివాదంపై స్పందించారు. ఆయన స్పందన ప్రకారం చూసిన ఈ విషయంలో జగన్ మోహన్ రెడ్డికి వస్తున్న వ్యతిరేకత వల్ల.. కాంగ్రెస్ కూటమి వైపు జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడల్లా వెళ్లడం కష్టమే. బీజేపీతో సంబంధాలు అంతంతమాత్రంగా ఉండే అవకాశాలు ఉన్నందున... కాంగ్రెస్ వైపు వెళ్లడం మంచిదనుకున్న వైసీపీకి ప్రస్తుత వివాదం చిక్కుల్లోకి నెట్టిందని అనుకోవచ్చంటున్నారు.

## విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

### నేడు జాతీయ సేవా పథకం దినోత్సవం

విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల కట్టలేనిది. సమాజంలో ఉన్నవారిని చైతన్యపర్చడంతో పాటు, సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేసినట్లవుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు. జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్ ) భారత ప్రభుత్వం చేత 1969 సంవత్సరం ప్రారంభించబడిన యువజన కార్యక్రమం.ఈ పథకాన్ని ప్రారంభించి నేటికీ 56 సంవత్సరాలు.(సెప్టెంబర్ 24 2024), ఇక దీని చరిత్రలోకి పోతే డా. డి.ఎస్. కొఠారి (1964-66) నేతృత్వంలోని విద్యా కమిషన్, విద్య అన్ని దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సి సి) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అని పిలువబడే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని వారు సిఫార్సు చేశారు. 1969 సంవత్సరంలో సెప్టెంబరులో జరిగిన వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ ఈ సిఫారసు ప్రకారంగా,సమస్యను వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో, పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా 'జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం,సహకారాన్ని అడిగిగారు. విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలుపంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం తెలియని నిర్మల మనస్కులు వీరు. వీరు కూడా సంఘజీవులే, సంఘంలో భాగస్వాములే, కాబట్టి సంఘసేవ (సోషల్ సర్వీస్) వాళ్ళకి బాధ్యత ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి.




ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి- లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ.

విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే అవకాశాన్ని కల్పించడం ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవను ప్రోత్సహించేందుకు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం రెండు భాగాలుగా విభజించబడింది: సాధారణ కార్యకలాపాలు మరియు ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు. సాధారణ కార్యకలాపాలలో వారంవారీ సమావేశాలు, సమాజ సేవ, సామాజిక సేవా ప్రాజెక్ట్‌లు ఉంటాయి. ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు సాధారణంగా 7 రోజుల పాటు నిర్వహించబడతాయి, ఈ సమయంలో విద్యార్థులు శుభ్రపరచడం, మొక్కల పెంపకం మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల వంటి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కళాశాలను పరిశుభ్రంగా వుంచటం- తోటలు పెంచటం- రోడ్లు వెయ్యటం. పరిసర గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామంలో రోడ్లు వేయటం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకి విద్య బోధించడం. ఆరోగ్య సూత్రాలను, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియజేయడం. వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమదాలలోనూ సహాయం చేయడం. ధనవంతుల నుండి విరాళాలు సేకరించి బీదవారికి, అనాథలకు సహాయపడటం. పొదుపు ఆవస్యకతను, అంటు వ్యాధుల వల్ల వచ్చే అరిష్టాలను అరికట్టే విధానాలను ప్రచారం చేయడం దీని ముఖ్య లక్షణం.

# రికార్డు సృష్టించిన రవీంద్ర జడేజా.. తొలి భారతీయ క్రికెటర్‌గా అరుదైన ఘనత!

**12 సార్లు ఒక టెస్టులో అర్ధ శతకంతో పాటు ఐదు వికెట్లు తీసిన జడ్డూ**

**భారత క్రికెటర్లలో ఈ జాబితాలో జడేజాదే అగ్రస్థానం**

**అతని తర్వాతి స్థానంలో అశ్విన్ (11), కపిల్ దేవ్ (07), హర్భజన్ (03)**



టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టుల్లో అరుదైన రికార్డు నెలకొల్పాడు. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 86 పరుగులతో పాటు 5 వికెట్లు పడగొట్టాడు. ఇలా ఒక టెస్టులో అర్ధ శతకంతో పాటు ఐదు వికెట్లు తీయడం జడ్డూకు ఇది పన్నెండోసారి. భారత క్రికెటర్లలో ఈ జాబితాలో జడేజానే అగ్రస్థానంలో ఉన్నాడు. అతని తర్వాత రవిచంద్రన్ అశ్విన్ (11), కపిల్ దేవ్ (07), హర్భజన్ సింగ్ (03) ఉన్నారు. ఇక ఈ ఫీట్ సాధించిన ప్రపంచ క్రికెటర్ల జాబితాలో జడేజా రెండవ స్థానంలో ఉన్నాడు. అతని కంటే ముందు కేవలం ఇయాన్ బోథమ్ (16) మాత్రమే టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఎక్కువ సార్లు ఈ ఫీట్‌ను సాధించాడు. అలాగే బంగ్లాదేశ్ సీనియర్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ (11) అశ్విన్‌తో సమంగా ఉన్నాడు. ఇదిలాఉంటే.. చెన్నై టెస్ట్‌లో రవిచంద్రన్ అశ్విన్ ఆల్‌రౌండర్ షోతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే. మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీతో పాటు రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసి, బంగ్లాను కుప్పకూల్చాడు. దీంతో ఆతిథ్య భారత జట్టు 280 పరుగుల తేడాతో బంపర్ విక్టరీ నమోదు చేసింది.

అటు మరో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా ఈ మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో అశ్విన్‌తో కలిసి జడ్డూ ఏకంగా 199 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన విషయం తెలిసిందే. 86 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడిన జడేజా.. జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగుల భారీ స్కోర్ నమోదు చేయడానికి దోహదపడింది. ఆ తర్వాత మొదటి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో మరో మూడు కీలక వికెట్లు తీశాడు.చెన్నైలో బంగ్లాను చిత్తు చేసిన రోహిత్ సేన ఇప్పుడు రెండో టెస్టును కాన్పూర్ వేదికగా ఆడనుంది. ఈ నెల 27 నుంచి ఈ మ్యాచ్ జరగనుంది.

# అదరగొట్టిన ఆంధ్రా కుర్రాడు.. దులీప్ ట్రోఫీ టాప్ స్కోరర్‌గా రికీ భుయ్



దేశంలో టాప్ ప్లేయర్లు ఆడే దులీప్ ట్రోఫీలో ఆంధ్రా కుర్రాడు రికీ భుయ్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇండియా డి తరపున ఈ సీజన్ లో మొత్తం 71 యావరేజ్ తో 6 ఇన్నింగ్స్ లో 359 పరుగులు చేశాడు. వీటిలో రెండు సెంచరీలతో పాటు ఒక హాఫ్ సెంచరీ ఉంది. ఎంతో మంది స్టార్ ప్లేయర్లు ఉన్నా.. వారందరిని దాటి టాప్ స్కోరర్ గా నిలవడం విశేషం. అంతేకాదు చివరి మ్యాచ్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ను అవార్డును గెలుచుకున్నాడు. ఈ మ్యాచ్ లో ఇండియా బి పై తొలి ఇన్నింగ్స్ లో 56 పరుగులు చేసిన ఈ ఆంధ్రా కుర్రాడు.. రెండో ఇన్నింగ్స్ లో 119 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు.

ఇతను పుట్టింది మధ్య ప్రదేశ్ లోనైనా చదువుకుంది మాత్రం వైజాగ్ లోనే. ఆంధ్ర తరపున రంజీ లీగ్ లు ఆడుతూ ఎన్నో సార్లు టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఐపీఎల్ లోనూ సన్ రైజర్స్ తరపున ఆడాడు. రంజీ సీజన్ లోనూ రికీ అద్భుతమైన బ్యాటింగ్ తో అదరగొట్టాడు. ఆంధ్రప్రదేశ్ తరపున 13 ఇన్నింగ్స్‌లలో 75.16 సగటుతో 902 పరుగులు చేశాడు. 2013లో దేశవాళీ క్రికెట్ లో అడుగుపెట్టిన ఈ 27 ఏళ్ళ కుర్రాడు ఇండియా అండర్ 19, ఆంధ్రా, సన్‌రైజర్స్ హైదరాబాద్, సౌత్ జోన్, ఇండియా %ూ%, బోర్డ్ ప్రెసిడెంట్స్ %శ×%, ఇండియా %దీ%, ఇండియన్ బోర్డ్ ప్రెసిడెంట్స్ %శ×%, ఇండియా బ్లూ జట్ల తరపున ఆడాడు. ఈ టోర్నీ విషయానికి వస్తే ఆల్‌రౌండ్ షోతో రాణించిన ఇండియా%-%ఎ జట్టు దులీప్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో 12 పాయింట్లు సాధించి టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇండియా%-%సితో ఆదివారం ముగిసిన మూడో మ్యాచ్‌లోనూ 132 రన్స్ తేడాతో గెలిచింది. 350 రన్స్ ఛేజింగ్‌లో సాయి సుదర్శన్ (111) సెంచరీతో చెలరేగినా.. ఇండియా%-%-సి 81.5 ఓవర్లలో 217 రన్స్‌కే ఆలౌటైంది. రుతురాజ్ (44) పోరాడినా విజయ్‌కుమార్ (17), ఇషాన్ కిషన్ (17) నిరాశపర్చారు. శాశ్వత్ రావత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

# బ్యాడ్ లక్ అంటే ఇతనిదే.. విచిత్రకర రీతిలో ఆఫ్ఘన్ బ్యాటర్ రనౌట్



క్రికెట్ లో రనౌట్ బాధ భరించలేనిది. అయితే ఇదే రనౌట్ బ్యాడ్ లక్ రూపంలో వస్తే జీర్ణించుకోవడం కష్టమే. ఆఫ్ఘనిస్తాన్, సౌతాఫ్రికా మధ్య జరిగిన మూడో వన్డేలో ఈ సంఘటన చోటు చేసుకుంది.

ఆదివారం (సెప్టెంబర్ 22) ముగిసిన మూడో వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ మొదట బ్యాటింగ్ చేస్తున్న సమయంలో మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడానికి వచ్చిన రహ్మత్ షా ఊహించని విధంగా రనౌట్ అయ్యాడు.

ఇన్నింగ్స్ 9 వ ఓవర్లో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ లుంగి ఎన్‌గిడి వేసిన బంతిని గర్బాజ్ మిడాన్ దిశగా ఆడాడు. దూరంగా వెళ్తున్న ఈ బంతిని అందుకోవడంలో ఎన్‌గిడి విఫలమయ్యాడు. దీంతో ఈ బంతి నాన్ స్ట్రైకింగ్ లో ఉన్న రహ్మత్ షా కు తగిలి వికెట్లను తగిలింది. అప్పటికే ఈ ఆఫ్ఘన్ బ్యాటర్ క్రీజ్ దాటడంతో ఔటయ్యాడు. దీంతో కేవలం ఒక్క పరుగుకే పెవిలియన్ కు చేరాడు. తొలి రెండు వన్డే మ్యాచ్ లు గెలిచిన ఆఫ్ఘనిస్తాన్ ఈ మ్యాచ్ లో ఓడిపోయింది. దీంతో సిరీస్ ను 2-1 తేడాతో గెలుచుకుంది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్.. 34 ఓవర్లలో 169 పరుగులకు ఆలౌటైంది. రహ్మానుల్లా గుర్బాజ్ 89 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. గుర్బాజ్ మినహా ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో ఏ ఒక్కరూ రాణించలేదు. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన సౌతాఫ్రికా.. 33 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఎయిడెన్ మార్క్రమ్ (69 నాటౌట్), ట్రిస్టన్ స్టబ్స్ (26 నాటౌట్) సఫారీలకు విజయాన్ని అందించారు.

# రెబల్ ఫ్యాన్స్ కి మరో మిర్చి.. కానీ..?

**కేథరీన్ అలెగ్జాండర్ యొక్క ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లు ఎల్లప్పు**





త్వరలో దేవర సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న కొరటాల శివ సినిమా మీద ప్రాణం పెట్టేశాడని తెలుస్తుంది. రైటర్ గా సూపర్ హిట్ సినిమాలకు పనిచేసిన కొరటాల శివ డైరెక్టర్ గా మారిన తర్వాత మిర్చి మొదలు భరత్ అనే నేను వరకు వరుస హిట్లు కొట్టాడు. ఐతే మెగాస్టార్ చిరంజీవి, చరణ్ తో కలిసి చేసిన ఆచార్య మాత్రం డిజాస్టర్ అయ్యింది. ఆ సినిమా ఫ్లాప్ కి రీజన్స్ ఏవైనా సరే కొరటాల శివ మెయిన్ రీజన్ అనుకున్నారు. ఆ తర్వాత కొరటాల శివ ఎవరితో సినిమా చేస్తాడా అని ఎదురుచూడగా ఎన్టీఆర్ తో దేవర ని ఫిక్స్ చేసుకున్నారు.

దేవర సినిమా విషయంలో ప్రతీదీ చాలా పర్ఫెక్ట్ గా ప్లాన్ చేశారు. ఐతే దేవర 1 సెప్టెంబర్ 27న వస్తుండగా ఈ సినిమా సెకండ్ పార్ట్ నెక్స్ట్ ఇయర్ ఉంటుందని తెలుస్తుంది. దేవర తర్వాత తారక్ చేయాల్సిన సినిమాల లిస్ట్ చాలా పెద్దగానే ఉంది. ఐతే కొరటాల శివ నెక్స్ట్ సినిమా ఎవరితో అన్న చర్చ మొదలైంది. ఎన్టీఆర్ దేవర 1 తర్వాత ఏడాది దాకా తారక్ కోసం వెయిట్ చేయక తప్పదు. ఈలోగా మరో సినిమా చేయాలంటే హీరోలు దొరకాలి. ఇదిలా ఉంటే కొరటాల శివ నెక్స్ట్ సినిమా ప్రభాస్ తో చేస్తాడని ఓ టాక్ వినిపిస్తుంది. ప్రభాస్ తో సినిమా అంటే అది ఐదేళ్ల తర్వాత అన్నట్టే లెక్క. ఎందుకంటే ప్రస్తుతం సెట్స్ మీద ఉన్న రాజా సాబ్ నుంచి కల్కి 2, స్పిరిట్, హను రాఘవపుడి సినిమా, సలార్ 2 ఇలా అన్ని పూర్తయ్యే సరికి ఎలా లేదన్నా 4, 5 ఏళ్లు అవుతుంది. ఈలోగా కొరటాల శివ తో సినిమా చేసే ఛాన్స్ లేదు. ఐతే ప్రభాస్ కు మిర్చి లాంటి హిట్ ఇచ్చిన డైరెక్టర్ కాబట్టి కొరటాల శివ మంచి కథతో వస్తే ప్రభాస్ కాదనే ప్రసక్తే లేదు. కానీ ఆయనతో సినిమా అంటే మాత్రం ఏళ్లకు ఏళ్లు వెయిట్ చేయాలి. ఈలోగా ఎన్టీఆర్ తో దేవర 2 కూడా పూర్తి చేసి మరో హీరోతో కూడా సినిమా చేసే ఛాన్స్ ఉంటుంది. కొరటాల లిస్ట్ లో చరణ్, అల్లు అర్జున్ కూడా ఉన్నారు. ఐతే వారు కూడా వరుస కమిట్మెంట్స్ తో సినిమాలు చేస్తున్నారు. దేవర తర్వాత కొరటాల శివ ఎవరితో చేస్తాడన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ అని చెప్పొచ్చు.

**హెబ్బా పటేల్ యొక్క ఫ్యాషన్ ఎంపికలు ఎల్లప్పుడూ ట్రెండ్‌లో ఉంటాయి**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com